నమస్తే తెలంగాణ
జిందగీ
10
ఆదివారం | 4 మే 2025 | www.ntnews.com
హైదరాబాద్

# చోరీకీ స్టోరీ!

## జువెల్ థీఫ్- ద హీస్ట్ బిగిన్స్

ఓటీటీ హిట్

**నెట్‌ఫ్లిక్స్:** స్ట్రీమింగ్ అవుతున్నది.
**తారాగణం:** సైఫ్ అలీఖాన్, జైదీప్ అహ్లావత్, నిఖితా దత్తా, కునాల్ కపూర్ తదితరులు,
**దర్శకత్వం:** కుకీ గులాటీ – రాబీ గ్రేవాల్

**హీరోనే** 'దొంగ'గా వచ్చిన ఎన్నో సినిమాలు.. ప్రేక్షకులకు 'కిక్'ను అందించాయి. బాలీవుడ్‌లోనూ 'ధూమ్' అంటూ.. థియేటర్లలో దుమ్ములేపాయి. బాక్సాఫీస్ దగ్గర భారీ కలెక్షన్లను కొల్లగొట్టాయి. అదే థీమ్‌తో వచ్చిన మరో బాలీవుడ్ దొంగ సినిమా.. జువెల్ థీఫ్. నేరుగా ఓటీటీలోకే వచ్చి, యాక్షన్ థ్రిల్లర్‌గానూ ప్రేక్షకుల మనసులు దోచేస్తున్న ఈ చోరీ స్టోరీలోకి వెళ్తే.. రెహాన్ రాయ్ (సైఫ్ అలీఖాన్) ఒక కాన్ ఆర్టిస్ట్. మాస్టర్ థీఫ్ కూడా. కుటుంబానికి దూరంగా ఉంటూ.. విలువైన వజ్రాలు దొంగతనం చేస్తుంటాడు. ప్రపంచ దేశాలు చుట్టి వస్తుంటాడు. ఈ క్రమంలో ఆర్ట్ కలెక్టర్ ముసుగులో ఉండే క్రిమినల్ రాజన్ ఔలఖ్ (జైదీప్ అహ్లావత్).. రెహాన్‌ను భారత్‌కు రప్పిస్తాడు. రెహాన్ తండ్రిని అడ్డుపెట్టుకొని.. రూ.500 కోట్లకుపైగా విలువ చేసే 'రెడ్ సన్' అనే వజ్రాన్ని దొంగిలించి తనకు అప్పగించాలని బెదిరిస్తాడు. ఆఫ్రికాకు చెందిన ఆ వజ్రాన్ని.. అక్కడి రాజవంశీకులు 18వ శతాబ్దం నుంచీ కాపాడుకొంటూ వస్తుంటారు. అయితే, ఆ వజ్రాన్ని కొన్ని రోజులపాటు ముంబయిలోని ఓ మ్యూజియంలో ప్రదర్శనకు పెడతారు. అప్పుడే దాన్ని దొంగతనం చేయాలని ప్లాన్ చేస్తారు. మరి.. అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉండే ఆ వజ్రాన్ని రెహాన్ చోరీ చేస్తాడా? రెహాన్‌ను పట్టుకోవడానికి ఎన్నో ఏళ్లుగా ప్రయత్నిస్తున్న పోలీసు అధికారి విక్రమ్ పటేల్ (కునాల్ కపూర్) ఆ దొంగతనం ఆపగలుగుతాడా? కన్నతండ్రే రెహాన్‌ను ఎందుకు ఇంటినుంచి గెంటేస్తాడు? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు దొరకాలంటే.. సినిమా చూడాల్సిందే!



# డ్యాన్స్‌లో నంబర్ వన్!

**బాలీవుడ్‌లో** నెలకో స్టార్‌కిడ్ పరిచయం అవుతున్నారు. అయితే.. వారిలో కొందరు ప్రేక్షకులను ఆకట్టుకోగలిగితే, మరికొందరు ట్రోల్స్‌కు గురవుతున్నారు. కానీ, సీనియర్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని మాత్రం.. మొదటి కోవలోకే వస్తుందని అంటున్నాడు బాలీవుడ్ స్టార్ కొరియోగ్రాఫర్ రెమో డిసౌజా. తాజాగా, ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. రాషా తడానీని ఆకాశానికి ఎత్తాడు. ఆజాద్ సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది రాషా. ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద విఫలమైనప్పటికీ, ఈ అమ్మడు మాత్రం విమర్శకుల ప్రశంసలు అందుకున్నది. నటనతోపాటు అద్భుతమైన డ్యాన్స్‌తో ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టింది. ఇదే విషయాన్ని మీడియాతో పంచుకుంటూ.. పరిశ్రమలో ఇప్పుడున్న వారిలో రాషా మాత్రమే మంచి డ్యాన్సర్‌గా రాణించగలదని అన్నాడు రెమో డిసౌజా. ''ఒక అమ్మాయిని చూశాను. ఆమె డ్యాన్స్ అద్భుతంగా ఉంది. భవిష్యత్తులో.. ఆమె అద్భుతమైన డ్యాన్సర్‌గా రాణిస్తుందని అనుకుంటున్నా. ఆమే.. రాషా తడాని. ఆమె నటనతోపాటు డ్యాన్స్‌లోనూ అదరగొడుతున్నది'' అంటూ చెప్పుకొచ్చాడు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న మలైకా అరోరా కూడా.. రెమోతో ఏకీభవించింది. ఆమె కూడా రాషాపై ప్రశంసల వర్షం కురిపించింది. ''ఆమె అద్భుతమైన డ్యాన్సర్! ఇండస్ట్రీలోకి వస్తున్న యువనటీనటులు తమను తాము నిరూపించుకోవాలి. రాషా మాత్రం.. ఇప్పటికే తానేంటో నిరూపించుకున్నది'' అంటూ కొనియాడింది. తన మొదటి చిత్రం 'ఆజాద్'లో ఉయ్ అమ్మా, బిరంగే పాటల్లో అద్భుతమైన నృత్యంతో ఆకట్టుకున్నది రాషా. తన తల్లి రవీనా టాండన్, గోవిందా 2002లో చేసిన ఐకానిక్ సాంగ్.. 'అఖియోం సే గోలి మారే'ను ఇటీవల రీ క్రియేట్ చేసింది రాషా. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట తెగ వైరల్ అవుతుండగా.. రాషా డ్యాన్స్ స్కిల్స్‌కు నెటిజన్లంతా ఫిదా అవుతున్నారు.





'సమాజం మనకు ఎంతో ఇచ్చింది. మనం కూడా సమాజానికి ఎంతో కొంత తిరిగి ఇవ్వాలి.. లేకుంటే లావైపోతాం' ఇది ఓ సినిమాలో డైలాగ్. కానీ ఓ యంగ్ టీమ్ దాన్ని నిజం చేస్తున్నది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ పిలుపు మేరకు ఒక్కచోటుకు చేరి చేతులు కలిపిన ఆ ఉద్యమకారులు.. నేడు సమాజ సేవకులుగా మారారు. నూనూగు మీసాల వయసులో విరిసిన స్నేహబంధం వారిని సప్త సముద్రాల అవతల ఉన్నా ఇప్పటికీ కలిపి ఉంచుతున్నది. సమాజ హితం కోసం పరితపించేలా చేస్తున్నది. అందుకే 'గివ్ ఫర్ సొసైటీ' (GIVE 4 Society) అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు వాళ్లంతా. విద్య, మహిళా సాధికారత, వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ తదితర రంగాల్లో సేవలందిస్తున్నారు. తెలంగాణ బాగు కోసం పరితపిస్తున్న ఆ మిత్రబృందం కథ అందరికీ స్ఫూర్తిదాయకం.

# నవ సమాజం కోసం.. ఉద్యమిస్తున్నారు

## నాడు తెలంగాణ ఉద్యమకారులు.. నేడు సమాజ సేవకులు

విద్యార్థి దశలో ఉద్యమకారులుగా తమ ప్రస్థానాన్ని ప్రారంభించిన వీళ్లంతా సామాజిక కార్యకర్తలుగా పోరాడుతున్నారు. ఉద్యమ బాటలో విరిసిన వీరి స్నేహబంధానికి సంకల్ప బలం తోడైంది. సత్య రాపెల్లి, పీవీ అరుణ్, అఖిలేశ్ కాసాని, పర్శురామ్ పంజాల, చంద్రశేఖర్ రెడ్డి, అభిషేక్, రాజు మోకిడె, మహిపాల్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, భాను గౌడ్, సాయి ఈశ్వర్, ప్రియాంకర్, సజేశ్ రావు, శ్రీనివాస్, సాయికృష్ణ సీ, లవణ్ కుమార్, ఫణిందర్ రావు, డాక్టర్ గోపీచంద్, జీ నరేశ్, అనిల్ బీ, రఘు సీ, సుమన్, అల్తాఫ్, భానుప్రకాశ్, శ్రీకాంత్, రమేశ్ జైనోజ్, రాంప్రసాద్, సునిల్, సతీశ్, శ్రీధర్, నరేశ్ బండి, రాంప్రసాద్, రజినీశ్, వేణుమాధవ్ వీళ్లంతా మలిదశ పోరులో పోటెత్తిన ఉద్యమ తరంగాలే! స్వరాష్ట్ర ఏర్పాటుకోసం ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో కొట్లాడారు. కాలక్రమంలో కొందరు అమెరికాలో, ఇతర దేశాల్లో స్థిరపడితే, మరికొందరు తెలంగాణతోపాటు మన దేశంలోని వివిధ ప్రాంతాల్లో సెటిల్ అయ్యారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులుగా, వ్యాపారవేత్తలుగా వివిధ రంగాల్లో రాణిస్తున్నారు. తర్వాత సమాజానికి తమవంతుగా ఏదైనా ఇవ్వాలనే తపన వారందరినీ మరోసారి ఒక చోటుకు చేర్చింది. అలా 2009లో 'గివ్ ఫర్ సొసైటీ' అనే స్వచ్ఛంద సంస్థ పురుడు పోసుకుంది. 'చదువుతోనే ఆకలి, పేదరికం తొలగించాలి. పేద పిల్లలకు నిస్వార్థంగా సాయం చేయాలి' ఇది గివ్ ఫర్ సొసైటీ సంస్థ నినాదం. వీరి సంకల్పానికి స్నేహబంధం బలమైంది. దాతల మద్దతుతో పల్లెలకు వెలుగులు పంచే పయనం మొదలైంది.

### భయం కాదు - జీవితంలో భాగం

'గిరిజన కుటుంబాల్లోని బాలికలకు రుతుస్రావం తెచ్చిన కొత్త ఆంక్షల భయం. వాటికి తోడు పేదరికం.. మూఢ నమ్మకాల ముప్పు అమ్మతనానికే శాపంగా మారుతున్నది' అని గివ్ ఫర్ సొసైటీ గుర్తించింది. అందుకే బాలికలకు, విద్యార్థినులకు, గిరిజన యువతులకు నెలసరి అనేది ఒక సహజమైన శారీరక ప్రక్రియ అని అవగాహన కల్పించారు. 'రుతుస్రావం.. భయం కాదు – జీవితంలో భాగం' అని వివరించి చెప్పారు. మూఢ నమ్మకాలు వదలాలని ఆరోగ్యంగా ఉండాలంటే శానిటరీ నాప్‌కిన్లు వాడటం తప్పనిసరి అని వివరించారు. ఇలా గివ్ ఇప్పటివరకు 230 ప్రభుత్వ బాలికల పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. అందరికీ ఉచితంగా శానిటరీ నాప్‌కిన్ల పంపిణీ చేపట్టింది. బాలికలు హైజీన్ సమస్యల కారణంగా బడి మానేయకూడదనే లక్ష్యంతో శానిటరీ నాప్‌కిన్లు అందజేస్తున్నది. అంతేకాదు.. రుతుస్రావంపై అవగాహన కల్పించేందుకు మారథాన్, హాఫ్ మారథాన్ లాంటి కార్యక్రమాలను సైతం వేదికగా చేసుకుంటున్నారు గివ్ నిర్వాహకులు.




### వెలుగులు నింపే సాహస యాత్ర

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కారేపల్లి మండలంలో ఊటవాగు అనే మారుమూల ఆదివాసీ గ్రామం ఉంది. పూర్తిగా అడవుల మధ్యలో ఉన్న ఆ పల్లెలో 55 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అక్కడికి రోడ్డు లేదు, బైక్ కూడా నడవదు. గ్రామంలో కరెంట్ కూడా లేదు. వారికి విద్యుత్ సౌకర్యం కల్పించడానికి గివ్ బృందం సాహస యాత్ర చేసింది. కొత్తగూడెం ప్రధాన రహదారి నుంచి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో, పూర్తిగా అడవుల మధ్య ఉన్న గ్రామానికి గుట్టల మీదుగా, అడవుల మధ్య, వాగులు, కుంటలు దాటి, సోలార్ దీపాలను మోసుకుంటూ వెళ్లారంతా. 55 కుటుంబాలకు సోలార్ దీపాలను పంపిణీ చేశారు. మొత్తం 40 కిలోమీటర్లు సాగిన ఈ ప్రయాణం ఫలితంగా ఆ కుటుంబాల్లో రాత్రిళ్లు వెలుగులు నింపడమే కాదు.. పిల్లలు చదువుకునే అవకాశం కలిగింది. గిరిజన కుటుంబాల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. మహిళలకు భద్రత చేకూరింది. 'ఇది సేవ మాత్రమే కాదు.. అది మనుషులందరికీ సమానమైన వెలుగు ఇచ్చే హక్కు ఉందని నమ్మే ఒక గంభీరమైన సంకల్పయాత్ర' అని గివ్ సభ్యులు గర్వంగా చెబుతారు.

### బడులను బాగుచేశారు

'ఒక్క పాఠశాల మారితే.. ఒక గ్రామం మారుతుంది' అనే సంకల్పంతో గివ్ సభ్యులు మారుమూల ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తున్నారు. చదువుకోవడం ఏమాత్రం కష్టంగా అనిపించవద్దని, పిల్లలు గర్వంగా పాఠశాలకు రావాలని గివ్ గట్టిగా నమ్మింది. అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణం, బాలికల కోసం ప్రత్యేక టాయిలెట్లు, పాత భవనాలకు రంగులు వేయడం, బెంచులు, డెస్కులు, ఇతర



ఫర్నిచర్ ఏర్పాటు, స్వచ్ఛమైన తాగునీరు అందేలా ఆర్వో ప్లాంట్లు, పట్టణ విద్యార్థులతో పోటీ పడేలా డిజిటల్ క్లాస్ రూమ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నది. గివ్ సంస్థ ఇప్పటివరకు మొత్తం 12 పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించింది. 'పెద్దకల్వల ప్రాథమిక పాఠశాల, పెద్దపల్లి జిల్లా కొమ్మిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల, మహబూబ్‌నగర్ జిల్లాలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సిద్దిపేట జిల్లా ముంద్రాయిలోని ప్రాథమికోన్నత పాఠశాల, సింగాయిపల్లి ప్రాథమిక పాఠశాల, దౌల్తాబాద్ హైస్కూల్, ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ హైస్కూల్, జగిత్యాల జిల్లా కోనరావుపేట ప్రాథమిక పాఠశాల, ఖమ్మం జిల్లా మామిళ్లగూడెం జెడ్పీహెచ్ఎస్, నల్గొండ జిల్లా చందుపట్ల జెడ్పీహెచ్ఎస్, చివెంల జెడ్పీహెచ్ఎస్, కరీంనగర్ జిల్లా మొలంగూరు జెడ్పీహెచ్ఎస్ ఇలా పన్నెండు పాఠశాలల్లో మేం చేసిన మౌలిక సదుపాయాల అభివృద్ధితో విద్యార్థుల హాజరు, ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల నమ్మకం పెరిగింది' అని గివ్ సభ్యులు చెప్తున్నారు.

### పదిలక్షల నోట్‌బుక్స్ పంపిణీ..

'చదువుతోనే సమాజ మార్పు.. చదువే మనకు భవిష్యత్తు' అనే సంకల్పంతో గివ్ ఫర్ సొసైటీ తన ఆవిర్భావం నుంచే విద్యాభివృద్ధిని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నది. రాష్ట్రంలోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్నది. ప్రతి బడి పిల్లవాడి చేతిలో 7 నోట్‌బుక్స్ పెట్టాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు గివ్ సభ్యులు. ఇలా ఇప్పటివరకు.. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా పది లక్షలకుపైగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. 'వేసవి సెలవులు ముగిసి పాఠశాల మొదలైన తర్వాత నెల రోజులపాటు మాకు ఇంకేం పని ఉండదు.. కార్ల నిండా నోట్‌బుక్స్‌తో బయలుదేరి.. ఖాళీగా వెనక్కి వస్తుంటాం' అని వివరిస్తారు గివ్ సభ్యులు. తమ ప్రయత్నంతో నిరుపేద విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గడంతోపాటు చదువుపై ఆసక్తి పెరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం బలపడుతుందని వారు విశ్వసిస్తున్నారు. విద్యార్థులకు బూట్లు, నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్స్, సైకిళ్లు, హాస్టల్ విద్యార్థులకు మంచాలు, దుప్పట్లు అందించడం ఇవన్నీ వీరి సేవలో భాగంగా కొనసాగుతున్నాయి. ప్రతిభావంతులై ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి స్కాలర్‌షిప్ అందిస్తున్నారు. 'మేము పిల్లలకు పుస్తకాలు, బూట్లు మాత్రమే ఇవ్వడం లేదు. భవిష్యత్తుపై నమ్మకాన్ని కలిగిస్తున్నాం. పాఠశాల అనేది భయపడే చోటు కాదు, ఆశతో వెళ్లే చోటు కావాలి' అనే లక్ష్యంతో పనిచేస్తున్నామని గివ్ బృందం గర్వంగా చెబుతున్నది. అంతేకాదు.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేలా ప్రాథమిక, హైస్కూల్ విద్యార్థులకు గాలి, నీటి కాలుష్యం గురించి ప్రత్యేక కార్యక్రమాలు, డ్రాయింగ్ పోటీలు, స్టూడెంట్స్ ప్రాజెక్టులు వంటివి నిర్వహిస్తున్నారు. మొక్కలు నాటించే కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడుతున్నారు.

### ఒక్క యూనిట్.. మూడు ప్రయోజనాలు

విద్యావంతులైన గివ్ సభ్యులు వినూత్నంగా ఆలోచించారు. విద్యార్థినులు, మహిళలకు రుతుస్రావం– పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో సరిపోదని, వారికి అందుబాటు ధరల్లో శానిటరీ నాప్‌కిన్లను అందిస్తేనే ప్రయోజనం కలుగుతుందని భావించారు. ఇందుకోసం ఇన్ఫోసిస్ మమత ట్రస్ట్, గ్రామీణ సపోర్ట్ ఫౌండేషన్ మద్దతుతో నిర్మల్ జిల్లాలోని మామడ, ముథోల్ గ్రామాల్లో శానిటరీ నాప్‌కిన్ల తయారీ యూనిట్లను ప్రారంభించారు. ఇవి ఇటీవలే ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్నాయి. వీటిని ఆయా గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలే నిర్వహిస్తున్నారు. ఈ యూనిట్లతో స్థానిక మహిళలకు ఉపాధి కల్పన, తక్కువ ధరకే హైజీన్ నాప్‌కిన్లు లభించడం, తద్వారా బాలికలు, మహిళలకు ఆరోగ్య పరిరక్షణ కల్పించడం.. మూడు రకాలుగా ప్రయోజనాలు కలుగుతున్నాయని సభ్యులు చెబుతున్నారు. వీటిని ఇతర ప్రాంతాలకు విస్తరించే యోచనలో ఉన్నారు. అంతేకాదు.. మహిళలకు ఆర్థికంగా సాధికారత సాధించేలా టైలరింగ్, బ్యుటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ తదితర ఉపాధి మార్గాల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఐటీ, డేటా సైన్స్ రంగాల్లో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ శిక్షణ మూడు నుంచి ఆరు నెలల పాటు జరుగుతున్నది. సంస్థకు చెందిన సభ్యులు ఇప్పటికే వివిధ సంస్థల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. వారు తమ పరిచయాలను ఉపయోగించి ఉద్యోగార్థులకు సరైన అవకాశాలు కల్పిస్తుండటం విశేషం.

### రైతులకు అండగా..

రైతులకు సుస్థిర జీవనోపాధి కల్పించడంలో గివ్ కీలకపాత్ర పోషిస్తున్నది. రైతులకు సేంద్రియ సాగుపై అవగాహన, పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులపై మార్గనిర్దేశనం చేస్తున్నారు. నీటి కొరతను ఎదుర్కొంటున్న గ్రామాల్లో నీటి ఆదా పద్ధతులు, వర్షపు నీటిని నిల్వ చేసే విధానాలు, జల సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకోవడంతోపాటు వారి పిల్లల విద్యకు ఆటంకం రాకుండా చేయూతను ఇస్తున్నారు. ఆ రైతు కుటుంబం జీవనోపాధి పునరుద్ధరణకు నగదు సాయం చేయడం, గేదెలు, ఎద్దులు కొనుగోలు ఆర్థిక వనరులు సమకూర్చడం లాంటివి చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సేవలు అందించడానికి, ఆరోగ్యంపై అవగాహన కల్పించేలా ఉచిత వైద్య పరీక్షలు, స్క్రీనింగ్ నిర్వహించడం, రక్తదాన శిబిరాలు, మహిళల ఆరోగ్య శిబిరాలు, ఉచిత ఔషధాల పంపిణీ లాంటివి చేస్తున్నారు. ఇలా ఉద్యమ బాటలో కలిసిన స్నేహితులు.. సేవామార్గంలో పయనిస్తూ, ఎందరో జీవితాల్లో వెలుగులు నింపుతున్న గివ్ సంస్థ సభ్యులకు మనమూ హ్యాట్సాఫ్ చెబుదాం!

... కాసాని నర్సింహా రెడ్డి




# మా ప్రేమకు.. అక్షయ్ శ్రీకారం

**తమ** ప్రేమకథ బాలీవుడ్ స్క్రిప్ట్‌కు ఏమాత్రం తీసిపోదని అంటున్నాడు సీనియర్ నటి అసిన్ భర్త, ప్రముఖ వ్యాపారి.. రాహుల్ శర్మ. వారి లవ్‌స్టోరీ సక్సెస్ కావడంలో బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ కీలకపాత్ర పోషించాడని చెప్పుకొచ్చాడు. 2012లో ఢాకాలో జరిగిన ఇండియా–పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా.. అక్షయ్ కుమార్ నేతృత్వంలోనే తమ ప్రేమకథ మొదలైందని వెల్లడించాడు. ఇటీవల ఓ జాతీయ మీడియాతో ఆయన మాట్లాడుతూ.. అసిన్‌తో తన మొదటి పరిచయం, వారి మధ్య ప్రేమ చిగురించడం గురించిన విషయాలను పంచుకున్నాడు. 2012లో అసిన్, అక్షయ్‌కుమార్ కలిసి 'హౌస్‌ఫుల్–2'లో నటించారు. ఈ సినిమా ప్రమోషన్ కోసం ఢాకాలో జరిగిన ఇండియా–పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్‌ను ఎంచుకున్నారు. ఆ క్రికెట్ టోర్నీని మ్యాక్రోమ్యాక్స్ స్పాన్సర్ చేయడంతో.. ఆ సంస్థ సహవ్యవస్థాపకుడైన రాహుల్ శర్మ కూడా అక్కడే ఉన్నాడు. ''ఆ మ్యాచ్ సందర్భంగానే నేను, అసిన్ మొదటిసారి కలుసుకున్నాం. మా ఇద్దరి మధ్యా ప్రొఫెషనల్‌గా అనేక పోలికలు ఉన్నాయనీ, ఇద్దరం మంచిజోడీ అవుతామని అక్షయ్‌కుమార్ భావించారు. అదే విషయం మాకు చెప్పి.. ఒకరి ఫోన్ నెంబర్ మరొకరికి ఇచ్చారు'' అంటూ నాటి సంగతులను గుర్తుచేసుకున్నాడు రాహుల్. ఎందుకని అడిగితే.. 'ఈ అమ్మాయి కూడా మీలాగే చాలా సింపుల్. డౌన్ టూ ఎర్త్. వస్తుంది.. తన పని తను చేసుకుంటుంది. వెళ్లిపోతుంది. చాలా ప్రొఫెషనల్ కూడా! వాళ్ల ఫ్యామిలీ కూడా అంతే! వీళ్ల అమ్మ డాక్టర్‌గా సేవలందిస్తుంటే.. తండ్రి సమాజ సేవ చేస్తుంటారు. నాకెందుకో మీ ఇద్దరూ మంచి జోడి అవుతారని అనిపిస్తున్నది. అందుకే!' అంటూ చెప్పాడట అక్షయ్ కుమార్. అప్పటి వారి పరిచయం క్రమంగా ప్రేమగా మారి.. పెళ్లి పీటలెక్కింది. ''నన్ను – అసిన్‌ను కలిపినందుకు అక్షయ్ కుమార్‌కు చాలా థ్యాంక్స్! ఆ పరిచయం.. నా జీవితానికి ఆయన చేసిన గొప్ప సహకారం'' అంటూ చెప్పుకొచ్చాడు రాహుల్. 2016 జనవరిలో రాహుల్ శర్మ – అసిన్ వివాహం చేసుకున్నారు. వీరిద్దరికి ఒకపాప. ఇక కేరళలోని కొచ్చికి చెందిన అసిన్.. తెలుగు, తమిళ సినిమాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. 2008లో అమీర్‌ఖాన్ సరసన 'గజినీ'తో బాలీవుడ్‌లో అడుగుపెట్టింది. రెడీ, లండన్ డ్రీమ్స్, హౌస్‌ఫుల్ 2, బోల్ బచ్చన్, ఖిలాడీ 786 లాంటి విజయవంతమైన చిత్రాల్లో నటించింది. పెళ్లి తర్వాత సినిమాలకు ఫుల్‌స్టాప్ పెట్టేసింది.